క్లుప్తంగా

నేడు అన్నదానం

మలికిపురం: మలికిపురంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం తెలిపింది. ఇటీవల అమ్మవారి జాతర ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. భక్తులందరూ హాజరు కావాలని ఆలయ కమిటీ ఆహ్వానించింది.

ర్యాలి ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం అందినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన మంతెన ఆనందరాజు ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



కేతరాజుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని కేతరాజుపల్లిలో శనివారం జరిగిన బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి పళ్లాలమ్మ జాతర

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని బోనం మెరకలో కొలువుదీరిన గ్రామదేవత పళ్లాలమ్మ జాతర ఆదివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలతో సామూహిక అష్టోత్తర శతకలశ పూజ, సామూహిక కుంకుమార్చనలు, వివిధ పుష్ప, ఫలార్చనలు, విశేష మహా నివేదన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు.

కొండేటి ఫౌండేషన్ ఆధ్వర్యాన సాయం

పి.గన్నవరం: పోతవరంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన అంధురాలు కొత్తపల్లి మరియమ్మకు కొండేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సమకూర్చిన రూ.5 వేల సాయాన్ని నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, ఎంపీటీసీ పులపర్తి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

రాజోలు: రాజోలు వేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. అలాగే ఆలయం వెనుక భాగంలో సుందరమ్మ చెరువు గట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ మొల్లేటి నాగరాజు ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, కొపనాతి పుష్పలత, సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాదులను ఆదుకుంటాం

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో కాలువ పక్కన గుడారాలు వేసుకుని ఎటువంటి ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్న యానాదులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తహసీల్దార్ వీవీ నరసింహారావు పేర్కొన్నారు. గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు యెనుముల నారాయణస్వామి, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వర బ్రహ్మాజీరావు కృషితో ఇటీవల జిల్లా కలెక్టర్‌కు యానాదుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో యానాదులతో సమావేశం నిర్వహించారు. వివరాలను నారాయణ స్వామి శనివారం విలేకరులకు తెలిపారు. యానాదులకు ఆధార్, రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన వివరించారు.

తాగునీటి సమస్యను నిరసిస్తూ ధర్నా

మామిడికుదురు: గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కరవాక గ్రామస్తులు శనివారం ధర్నా చేశారు. గ్రామ పంచాయతీ ఎదురుగా ప్రధాన రహదారిపై టెంట్ వేసి గంట సేపు ఆందోళన చేశారు. మహిళలు ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కాయకష్టం చేసుకుని జీవనం సాగించే తమకు వచ్చిన ఆదాయం తాగునీటికే సరిపోతుందంటూ వాపోయారు. పది రోజులకు ఒకసారి కూడా తాగునీరు రావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

పాల దిగుబడిపై వడదెబ్బ

- చూడి కట్టే అవకాశం లేనట్లే
- ప్రాణాలు కోల్పోయే ప్రమాదం



అంబాజీపేటలో ఆరుబయట ఉన్న పశువులు

అంబాజీపేట: వేసవిలో పాడి రైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడమే కాక.. ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడుకట్టే అవకాశం ఉండదని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కోసారి పశువు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9,500, గేదెలు 12,300, కొత్తపేట నియోజకవర్గంలో ఆవులు 6180, గేదెలు 8,500, రాజోలు నియోజకవర్గంలో ఆవులు 5,150, గేదెలు 8,070 ఉన్నాయి.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుదు వ్యాధి బారిన పడతాయి. రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సుల ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కోసారి కింద పడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి కోల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడ దెబ్బ తగిలిందని రైతు గ్రహించి, దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలి. వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి



పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో వేసి నట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులకు, గేదెలకు పంకాలు ఏర్పాటు చేయాలి.

– డి.రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి, అంబాజీపేట

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



అంతర్వేది దేవస్థానం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం వద్ద శనివారం దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎమ్మెల్యే మజ్జిగను పంపిణీ చేశారు. వేసవిలో పుణ్యక్షేత్రంలో భక్తుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు, నాయకులు చింతా ముత్యాలరాజు, కొల్లాటి నరసింహస్వామి, బెల్లంకొండ సూరిబాబు, కుసుమ చంద్రశేఖర్, కోళ్ళ వేణుప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: వేసవిలో దారుణంగా ఉన్న ఎండల్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వామి వారి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకుని అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, ట్రస్టీలు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, బత్తుల గంగారత్నం, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొడగట్లపల్లిలో..

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లిలో ఉన్న ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పొడగట్లపల్లి సర్పంచ్ గంధం దేవి, గంధం అన్నవరం, సత్రం ఈఓ రాధాకృష్ణ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అరుంధతీ వశిష్ఠుల కల్యాణం



అంతర్వేది వశిష్ఠ ఆశ్రమ ప్రాంగణంలో అరుంధతీ వశిష్ఠుల కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది వశిష్ఠ ఆశ్రమ ప్రాంగణంలో శనివారం అరుంధతీ వశిష్ఠుల దివ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ గురూజీ ప్రసాదరాజు ఆధ్వర్యాన కల్యాణం ఆద్యంతం భక్తులను భక్తి పారవశ్యంలో ఓలలాడించింది. ఉదయం ఆశ్రమ ప్రాంగణంలో చింతలపాటి రఘురామరాజు-రాధ దంపతులు, పేరిచర్ల శివరామరాజు-రమణి దంపతుల సౌజన్యంతో నుదురుమాటి శ్రీనివాసశర్మ వార్షిక కల్యాణాన్ని 10.45 గంటలకు కృత్తికా నక్షత్రయుక్త మిథునలగ్నంలో వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతిపూజ, పుణ్యాహవాచనం, స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరణ చేశారు. శ్రీవారి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నగరంలో రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న చిన్నారులు

కొత్తపేట: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. శుక్రవారం రాత్రి ఆకాశంలో నెల వంకను చూసిన ముస్లింలు రంజాన్ మాసం ఉపవాస దీక్షలను ముగించారు. శనివారం ఉదయం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం, మార్కెట్‌వీధి మసీదులు, పలివెల, వానపల్లి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం పలువురు ముస్లిం నాయకులు తమ బంధులను, ముస్లిమేతర మిత్రులను తమ స్వగృహాలకు ఆహ్వానించి తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వారికి తేనీటి విందు ఇచ్చారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఎంతో ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా మసీదుల్లో ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు జరిగాయి. రంజాన్ పండగలో భాగంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పెదపట్నం, కొమరాడ, మగటపల్లి గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేదలకు ధానధర్మాలు చేశారు. స్నేహితులను ఇంటికి పిలిచి సేమియా పంచారు. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు నిర్వహించిన కఠోర ఉపవాస దీక్షలు సంపూర్ణమయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని ముస్లింలంతా రంజాన్ పండగను శనివారం ఘనంగా చేసుకున్నారు. మనుషులు మధ్య ప్రేమ, ధనిక తేడా ఉండకూడదు. శత్రుత్వం అనేది అసలుండకూడదు అనే పవిత్ర ఖురాన్ మాటలను వారు తూచా తప్పకుండా పాటిస్తామని పలువురు పేర్కొన్నారు. రంజాన్ పండగ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఖబరిస్తాన్ (శ్మశానాల)కు వెళ్లి అక్కడ దివంగతులైన తమ పెద్దల ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. ఎండీ రఫీ, ఎండీ ఆరీఫ్, ఎండీ ఇస్మాయిల్, ఎస్‌కే కరీముల్లా, కరీం, పాషా తదితరులు పాల్గొన్నారు.

చింతనలంకలో..

అయినవిల్లి: మండలంలోని చింతనలంక, విలస గ్రామాల్లో ముస్లింలు రంజాన్ ప్రార్థనలు జరిపారు. పేదలకు స్వీట్లు, పాయసం పంచారు. ఒకరూనొకరూ ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆలమూరులో..

ఆలమూరు: వివిధ గ్రామాల్లో ముస్లింలు శనివారం రంజాన్‌ను చేసుకున్నారు. నెల రోజుల ఉపవాసం దీక్ష అనంతరం ముస్లింలు ఆయా మసీదుల్లో సామూహిక ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలమూరులోని అల్ హుదా మసీద్‌తో పాటు పెదపళ్ల, నర్సిపూడి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ నెలలోనే ఆవిర్భవించిన ఖురాన్ మత గ్రంథాన్ని పఠించి తమ భక్తిని చాటుకున్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగ, ర్యాలి, బొబ్బర్లంక గ్రామాల్లో శనివారం రంజాన్ పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ వేడుకలు చేసుకున్నారు.

జైభీమ్ జ్యోతి యాత్రకు ఘన స్వాగతం



పి.గన్నవరంలో జైభీమ్ జ్యోతి యాత్రకు స్వాగతం పలుకుతున్న దళిత నాయకులు

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జైభీమ్ జ్యోతి యాత్రకు నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో దళిత నాయకులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు, జాగృతి నాయకులు సుబ్బరాజు, పెయ్యిల దుర్గా ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. బాణసంచా పేల్చారు. సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, సాధనాల రమేష్, కోట విజయభాస్కర్, పమ్మి అర్జునరావు, నక్కా వీవీ సత్యనారాయణ, సాకా సత్యం, నూకపెయ్యి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమ్ జ్యోతి యాత్రకు శనివారం మామిడికుదురు, పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లలో ఘనంగా స్వాగతం పలికారు. రెండు సెంటర్లలోను అంబేడ్కర్ విగ్రహాలకు నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఏ స్‌ఆర్ భూపతి, నెల్లి దుర్గాప్రసాద్, పాలమూరి గోపాల్, భూపతి వెంకటపతి, యూవీవీ సత్యనారాయణ, భూపతి వెంకటరమణ, కొనుకు నాగరాజు, కలిగితి పళ్లంరాజు, నల్లి శ్రీనివాస్, చిక్కం బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా విద్యా సంస్థలు పనిచేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక స్థాయితేజ విద్యాసంస్థల 24వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయితేజ డైరెక్టర్ అన్నాబత్తుల అనుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్పర్తి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంఈఓ హెలీనా, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ దాసరి మౌనిక, కళాశాల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, స్కూలు ప్రిన్సిపల్ సుంకర వెంకటకృష్ణ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం



అన్నదాన విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానానికి అదే గ్రామానికి చెందిన పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, మంగాదేవి దంపతుల కుమారులు పెద్దింశెట్టి కృష్ణసాయి వీరనాగరామ్, దివ్య దుర్గా ఫణి పద్మకుమార్‌లు శనివారం రూ.50,116 విరాళంగా సమర్పించారు. విరాళం సొమ్మును దాతల తాత, నాన్నమ్మలు, తల్లిదండ్రుల చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే



ఎస్పీ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌ను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీగా శ్రీధర్ ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఎస్పీని కలసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్ శాఖ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా కార్యాచరణ చేపట్టాలని చిట్టిబాబు కోరారు.

నాసిరకంగా రోడ్ల నిర్మాణం

మలికిపురం: శివకోడు ఆర్అండ్‌బీ రోడ్డుతో పాటు, మట్టపర్రు చింతలపల్లి రోడ్ల నిర్మాణం నాసిరకంగా జరిగిందని లక్కవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సత్య సీతారామరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధికారులు ఈ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించి విచారణ జరపాలని కోరారు.

పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



వేగివారిపాలెంలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం-3లో పార్టీలో మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ మట్టా పార్వతి, పార్టీ జిల్లా ప్రచార కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, కుడుపూడి సత్తిబాబు, కుసుమ శ్రీను, మట్టపర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకుడు రొక్కాల బాపూజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం అవసరమయ్యే రహదారులను గుర్తించి వాటి అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడిలో రహదారి నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. గడపగడపకూ నిధులతో చిట్టిచెరువుగట్టు, కొత్తకాలనీల్లో రోడ్డు నిర్మాణానికి రూ.16 లక్షలు, ఎస్‌ఎస్ నగర్‌లో రూ.4 లక్షలతో పంట కాలువపై వంతెన నిర్మాణ పనులు చేయనున్నామన్నారు. రహదారుల నిర్మాణ పనులు త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కోట బేబిరాణి, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్, కడలి సత్యనారాయణ, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికే అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం వేగివారిపాలెంలో పాముల వారి గ్రూపులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో గృహనిర్మాణాలు చాలా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సునీత, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, సూరిశెట్టి బాబి, షరీఫ్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని దేవరపల్లిలో శనివారం ఎస్సీ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.